# వేట

ఉదయం ఎనిమిది గంటలయింది. వేసంకాలం మూలంగా అప్పటికే ఎండవేడి ఎక్కువగా ఉంది.

వంటింట్లో ఉప్మా కలియబెడుతోంది కమల. కారేచెమటను ఎడమచేత్తో పమిటకొంగుతీసుకుని ఒత్తుకుంటోంది. ఏదో వింత శబ్దమవుతూంటె తలెత్తిచూసింది.

ఎదురుగా గోడమీదవున్న పురుగు ఆమెకంటపడింది.

ఆనందంగా రెక్కలుఊపుకుంటూ వయ్యారంగా నడుస్తోంది ఆపురుగు.

"హాయిగా తిరుగుతోంది. ఈవేడి, ఈ ఉక్కపోత దానికి లేవనుకుంటాను" అనుకుంది కమల.

అంతలోనె పొంచి పొంచి దానివెంట నడుస్తున్న బల్లిని చూసింది కమల.

"అయ్యో! ఆపురుగును చంపుకుని తింటుంది కాబోలు" అనుకుని కాళ్లుఎత్తి చెయ్యిచాపి 'ఉష్ ఉష్' అంది గట్టిగా.
ఆ రెక్కల పురుక్కి ఆమెచేసిన శబ్దం వినబడి అర్థమయిందోలేదోకాని ఎగిరి ఇంకాకొంచెం ముందుకెళ్ళి వాలింది.

"హమ్మయ్య బ్రతికింది వెర్రిపురుగు" ఆమెమనస్సు కాస్త కుదుటపడింది. కమల తయారైన ఉప్మాగిన్నె కిందికి దింపింది. కాఫీనీళ్ళుపెట్టగానే పొయ్యిమీద

తిరిగి తలెత్తి చూసింది.

బల్లి మెల్లిగా ముందుకు పాకుతోంది.

"ఈబల్లి నాశనంకాను ఈపురుగును బతకనిచ్చేటట్టులేదు. పాపం అపురుక్కి ఈమాయదారి బల్లిచేతిలో చావు రాసిపెట్టి నట్టుంది" ఆమాటలు అనుకోకుండా పైకే అనేస్తోంది.

ఈసారి పురుక్కి ఏమి అనుమానం కలిగిందోకాని ఎగిరి ఇంకొంచెం ముందుకువెళ్ళి వాలింది. మళ్ళీ సన్నని సంగీతంపాడు కుంటూ హాయిగా తిరుగుతోంది.

"అపురుక్కిలేనిబాధ నాకొచ్చిపడిందీరోజు" అనుకుంది కమల. మరుగుతున్న నీళ్ళలో కాఫిపొడివేసి కలియబెట్టి కిందికి దింపింది. చన్నీళ్ళచల్లి మూత పెట్టింది.

తిరిగి బల్లి మెల్లిగా ముందుకు పాకింది. ఆశ్చర్యంగా అటే చూస్తోంది కమల.

"టిఫిన్ తయారైందా కమలమ్మా" అంటూ వంటింట్లో అడుగుపెట్టాడు నౌకరు బక్కి.

ఆదృష్టిలోలేని కమలకు బక్కిమాటలు చెవులోకి ఎక్కనే లేదు.

గోడకేసి చూస్తున్న కమలమ్మనుచూసిన బక్కి తలెత్తి అటే చూశాడు.

ముందు పురుగు నాకేమని నడుస్తోంది. వెనకే బల్లి పొంచి పొంచి చూస్తూ నేనున్నానని పాకుతోంది.

"ఇంక పట్టేస్తుంది" అన్నాడు గట్టిగా బక్కి. ఈసారితల తిప్పి చూసింది కమల.

"ఆపురుగు హాయిగా తిరుగుతూంటె ఆబల్లి ఎందుకయ్యా దానివెంటబడింది" అంది కమల అమాయకంగా.

"మీకు ఆపురుగునుసూస్తే సంతోసమనిపించింది. ఆబల్లికి సంపుకు తినాలనిపించింది. లోకంలో అందరూ మీలాటి అమాయకులు కాదమ్మా!"

"ఆబల్లిజోలికే వెళ్ళలేదు. అయినా పాపం ఆపురుగు ఏం అపకారంచేసిందని చెప్పు ఆబల్లికి అంతపగ"

"అపకారం సెయ్యక్కరలేదమ్మ. కొందరి మనస్సేఅంత. పొంచిపొంచి సూసి మీదపడుతూనె ఉంటారు. వారికి అదేసంతోషం దాన్నే ఏంటంటారమ్మా!"

"ఏమిటో ఏమో. అపురుగు పారిపోతే బాగుండును" అంది.

అంతలో బల్లి ఒక్కసారి పాకి పురుగును నోటితో పట్టింది ఆపురుగు సన్నగా అరుస్తూ బాధతో విదిలించుకుంటోంది. ఆ దృశ్యం చూడలేక కమల కెవ్వునఅరిచి కళ్లుమూసుకుంది. "మరీ అంత జాలిగుండెఅయితే ఈలోకంలో బతకటం కట్టం. దైర్యంగా ఉండాలి ఆమాట వినగానె ఆమెమనసు కలుక్కుమంది. పురుగు కూత ఆగిపోయింది. బల్లిఎటో వెళ్ళిపోయింది. మనసు వికలమై పోయింది. పాలు మరగడంచూసి పాలగిన్నె కిందికి దించింది.

'బక్కి' అన్న పిలుపు వినబడింది.

"అమ్మో! అయ్యగారు పిలుస్తున్నారు" అంటూనె వంట గదిలోనుంచి హాల్లోకి వచ్చాడు. మేడవరండాలో నిలబడి ఉన్నాడు యజమాని ఫణిరాజ్. "బక్కీ! నువ్వింకా కూర్లకి వెళ్లలేదా. వెళ్ళి త్వరగా తిరిగిరావాలి. టిఫిన్ కాఫీ పైకి పంపించమను" అంటూనె అక్కడనుంచి వెనక్కి తిరిగాడు.

ఒక్కఅంగలో వంటింట్లోకి ఉరికాడు బక్కీ. "కాఫీటిఫిన్ తయారైతే పైకి పట్టుకు రమ్మంటున్నారు" అన్నాడు.

"ఇవిగో రెడీగా ఉన్నాయి. నువ్వే పట్టుకెళ్లు" అందికమల.

"లేదు కమలమ్మ నేను కూరలకి ఎల్లకపోతే ఇప్పుడు చంపుతారు. మల్లి నువ్వే ఇచ్చేసెయ్యి"

కమలకి చెప్పలేని భయం.

"ఇంతకీ అమ్మగారు ఎప్పుడొస్తారు" అడిగింది కమల.

"రాత్రేగా ఎడతా. అప్పుడే కంగారుపడితే ఎట్టా. రెండు దినాలలో వచ్చేత్తామన్నారు" అన్నాడు బక్కీ.

"ఈఇంట్లో పనిచెయ్యబుద్ధికాదు" అంటూనె కమల కాఫీ కలిపి ఫ్లాస్కులోపోసింది. ఉప్మా ప్లేట్లోపెట్టింది. ఫ్రిజ్‌లోనుంచి నీళ్ళసీసాతీసింది. "ఆరులేకపోయినా మనకుతప్పదుకదా. పట్టుకెళ్లు పట్టుకెళ్ళు. అయ్యగారికి ఆకలేస్తోంది. నన్ను తిడతారు" అంటూనె కూరగాయలసంచీ తీసుకుని వీధితలుపులు దగ్గరగా లాగి వెళ్ళిపోయాడు బక్కీ.

ఆమాటలువిన్న కమలకు వళ్ళంతా ఒక్కసారి జలదరించింది. కమల ఆయింట్లోచేరి మూడునెలలయింది. నెలకి వంద

రూపాయల జీతమిస్తున్నారు. ఒకపూటే అన్నీ వండుతుంది. ఇంట్లో పనులన్నీ తెముల్చుకుని ఎనిమిదింటికల్లా వస్తుంది. ముప్పై ఏళ్ళువచ్చి ఇద్దరుపిల్లల తల్లియైన కమలలోని అందం తరగలేదు. చక్కనిఛాయ. దానికితగిన అందమైన ముఖం. ఒకసారి చూసిన వారు చూపులు మరల్చుకోలేరు. అతిసుకుమారంగా ఉండే ఆమె శరీరం పనిపాటలు చెయ్యకలుగుతుందా అనుకుంటారు. అలాగె నెమ్మదిగా చేసుకొస్తుంది కమల. అతిసుకుమారం కటికదరిద్రంలా ఉంది ఆమె పరిస్థితి.

ముందు శ్యామలారాణికూడా ఆమెను ఇంట్లో పెట్టుకో డానికి చాలా భయపడింది. కమల ప్రవర్తన చూసిన తర్వాత సంతృప్తిపడింది

శ్యామలాంబ చిన్నదైన కమల ఆమె పంచన పని చేసు కుని వెళ్ళిపోతోంది. కాని,ఆమెభర్త ఫణిరాజ్ చూపులుమాత్రం ఆమెను నిలువెల్లా తినేసేటట్టు ఉంటాయి. అందుకే అతని కంట పడటానికి కమలకు చాలాభయం.

అందుకే అతనికి కనబడకుండా వంటింట్లోనే ఉంటుంది. అన్నీవండి అక్కడపెట్టడం కమలవంతు. పెట్టుకోడం శ్యామలా రాణివంతు.

వయస్సులోఉన్న ఫణిరాజ్ చూపుతోపాటు అతని ఆకారం చూస్తేనే భయపడుతుంది కమల. ఆమె పనిలోకి వచ్చాక ఎప్పుడూ మేడఎక్కి ఎరగదు. అతనికి టిఫిన్‌పెట్టి ఎరగదు.

తయారుచేసి అక్కడపెడితే బక్కి అతనికి పెడతాడను కొని పనిలోకి వచ్చింది. కాని ఇప్పుడు తానే మేడమీదికి టిఫిన్ పట్టుకెళ్ళాలి. అడుగు ముందుకు పడ్డంలేదు.

మెల్లిగా అవిపట్టుకొని మేడ మెట్లవరకు వచ్చింది. ఒక మెట్టు మీద కాలువేసి పైకిచూచింది. తాను వస్తుందోలేదోనని చూడ టానికి వచ్చినట్టున్నాడు ఫణిరాజ్.

ఆమెవైపే చూస్తున్నాడు. ఆచూపుల్ని భరించలేక తల దించుకుంది. గుండెదడ ప్రారంభమైంది. ఏదో చెప్పలేని భయం. మెల్లిగా మీదివరకు వెళ్ళింది. అక్కడ పెద్దహాలుఉంది. నేలమీద ఖరీదైన కార్పెట్ పరిచి వుంది. పక్కన ఖరీదైన సోఫాసెట్టు. ఆకార్పెట్ మీద నడుస్తూంటె వెల్వెట్ తివాచీ అంతమెత్తగా వుంది.

కాని అక్కడ ఫణిరాజ్ లేడు. అక్కడపెట్టి వెళ్ళిపోడానికి భయపడింది. బెడ్రూములో ఉన్నట్టున్నాడు. ఆమె తొంగి చూసింది.

కుక్క భౌ! భౌ! అంటూ అరిచింది.

ఫణిరాజ్ కంటె భయంకరంగా కనబడుతుంది అతని కుక్క. అందుకే వెనక్కి అడుగువేసింది. అతన్ని పిలవడానికి నోరురాలేదు. తాను వస్తూన్నట్టు చూసి లోపలకు ఎందుకు వెళ్ళి పోయాడో ఆమెకు అంతుపట్టలేదు.

కుక్క భౌ! భౌ! అంటూ గదిలోనుంచి వస్తూనె పక్క నుంచి పోతున్న పిల్లిమీదికి ఒక్కదుముకు దుమికింది.

భయంతో కెవ్వుమంది కమల.

క్రీమీ! అంటూ పరుగెత్తుకొచ్చాడు ఫణిరాజ్. పిల్లి తప్పించుకోడానికి పెనుగులాడుతోంది. ఆ దృశ్యం చూడలేక నిలువెల్లా వణికిపోతోంది కమల.

అది చూసి 'ఆహా! హా!' అంటూ నవ్వుతున్నాడు ఫణిరాజ్. అతనికి నవ్వెలావస్తోందో కమలకు అర్థంకాలేదు. అతనినిచూసి మరింత భయపడింది. ఆమెను పరిశీలనగా చూశాడు ఫణిరాజ్. సమయం ఆసన్నమైదనుకున్నాడు. నవ్వుఆపి ఆమెను సమీపించాడు. భయపడకు దమయంతీ నేనున్నాగా అంటూనె చేతిలోని సామానుతీసి పక్కనున్న టీపాయ్ మీద పెట్టాడు. ఆమెలో చలనంలేదు అతనిని వారించటానికి. భయంతో వళ్ళు తెలియని తన్మయావస్థ. అదే అదననుకున్న ఫణిరాజ్ ఆమెను తన బిగి కౌగిట్లో బంధించాడు. రెండుచేతులతో ఆమె నడుము భుజాలు తనివితీరా తడుముతున్నాడు. అతని పెదవులు ఆమె పెదవులను బంధించాయి. స్వర్గసుఖాలను చవిచూస్తున్నాడు అతను. వళ్ళు తెలియక ఏదోలోకాల్లో సంచరిస్తోంది కమల మనస్సు.

మెల్లిగా ఆమెను పడకగదివైపు నడిపించుకు వెళ్ళాడు. మంచంమీద పడుకోబెట్టబోయాడు.

అప్పటికి ఆమెకు కాస్త బాహ్యప్రపంచం తెలిసింది. కళ్ళు విప్పి చూసింది. అతని పడకగది అది. అతని బాహువుల్లో ఒదిగిపోయి తను. ప్రమాదం గుర్తించింది.

విడిపించుకోడానికి పెనుగులాడటం ప్రారంభించింది. బలమైన అతనిచేతులవలలో చిక్కుకున్న ఆమె వక్షస్థలం బయటకు రాలేదు. అతని పెదవులతో బంధింపబడ్డ ఆమె పెదవులు విడిపడలేదు. లేనిశక్తి తెచ్చుకొని అతని పీకని రెండు చేతులతో బలంగానొక్కి వెనకకుతోసింది. అంతవరకు మకరందాన్ని గ్రోలుతున్న ఆమెపెదవులను వదలి అమ్మాఅంటూ మెడపక్కకు

తిప్పకున్నాడు. కమల ఆలస్యం చెయ్యకుండా అతని మెడమీద కండ ఊడి వచ్చేటట్టు కరిచింది.

"అబ్బా!" అంటూ ఫణిరాజ్ దమయంతిని వదలి ఒక్క తోపుతోశాడు.

దమయంతి వెళ్ళి గోడకు కొట్టుకుంది. ఆమె నుదురు చిట్లి 'బటబటా' రక్తం కారడం ప్రారంభించింది అయినా అవేమీ పట్టించుకోకుండా నిలదొక్కుకుని జారినపమిట సద్దుకొని తలుపు దాటి హాలులోకి పరుగెత్తింది కమల. రక్తం నేలపొడుగునా కారుతోంది కోపంతో ఊగిపోయాడు ఫణిరాజ్. అతనికళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి. దెబ్బతిన్నపులిలా ఫణిరాజ్ క్రీమీ ఉస్కో ఉస్కో అన్నాడు. కమలకేసి చేయి చూపించాడు.

పిల్లిపారిపోయి ఖంగుతిన్న కుక్క రక్తంవాసన పసి కట్టింది. భౌ!భౌ! మంటూ శరవేగంతో కమలమీద పడింది.కమల చీర అందింది కుక్కకు. మనిషిని విడిపించుకోగలిగింది కాని కుక్కను విడిపించుకోలేకపోయింది కమల. ఆమె చీరను లాగుతోంది. అసలే అరిగి పాతగిల్లి పొట్లపండులాఉన్న చీర ఎక్కడి కక్కడ విడిపోతోంది.

భయంతో కమల బక్కీ! బక్కీ అంటూ పిలుస్తోంది.

అదిచూసి ఆహా! హ అంటూ నవ్వుతున్నాడు ఫణిరాజ్.

ఆనవ్వుకు పెద్ద కొండగుహలా తెరుచుకుంది అతనినోరు. వేటకువెళ్ళి జంతువులమీదికి కుక్కను ఉసుకొల్పిన వేటకాడులా అనిపించాడు ఆమెకంటికి.

అంతలో కూరలసంచితో బక్కి అక్కడకు వచ్చాడు. ఆ దృశ్యం చూసేటప్పటికి అతనిగుండె కరిగిపోయింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

దొంగలా గదిలోకి తప్పుకుంటున్న యజమానిని చూశాడు.

కాని ప్రశ్నించే అధికారం తనకులేదు. ఏదైనా అంటే ఆ వేటలో తాను బలైపోతాడు. కూరగాయలసంచీ అక్కడేవదిలాడు కమలను రక్షించడానికి. అందుకే పక్కనేఉన్న కుక్క గొలుసు తీసుకుని క్రీమీ అంటూ ఒక్కపరుగుపెట్టాడు

కుక్క కమలనువదిలి పైకిపరుగెత్తి సోఫా వెనకాల నక్కి కూచుంది. ఎంతటివారికైన ప్రాణాలమీదితీపి అటువంటిది. తమ శరీరమంటే మమకారం అటువంటిది.

రోజూ సాయంకాలం దానిని షికారుకు తీసుకు వెడతాడు బక్కి. అక్కడ చెప్పినమాట వినకపోతే ఆచైను వెనక్కు తిప్పి దానితో ఒక్కటివేస్తాడు. అంతే మరి మాట్లాడదు. ఆ దెబ్బ కుక్కకు బాగాగుర్తు. అందుకే బక్కిచేతిలో గొలుసు చూడగానె తోకముడిచి పారిపోయింది.

ఆగొలుసు అక్కడే పడేసి కమలను నడిపించుకుంటూ కిందికి తీసుకువచ్చాడు. ఆమె నుదుటిగాయాన్ని చన్నీళ్ళతో శుభ్రంగా కడిగాడు. పాతబట్ట తడిపి దానిమీద కట్టాడు. చల్లటి నీళ్ళుతెచ్చి తాగించాడు. ఆమెప్రాణం కాస్త కుదుటపడింది.

"కమలమ్మా! కాఫీ తాగుతావా" అన్నాడు.

వద్దన్నట్టు తలూపింది.

పొద్దుటినుంచి కాఫీకూడా తాగిఉండదని బక్కీకి తెలుసు. పేదపొట్ట పేదవానికే తెలుస్తుంది. ఎప్పుడో రాత్రి చాలీచాలకుండా తిన్న అన్నం. అయినా తానేమి చెయ్యగలడు. తనస్థితి కూడా అంతే.

కమల మెల్లిగా లేచింది. రక్తంచారలు కట్టిన మొఖంమెడ కడుక్కుంది. రక్తంతో తడుస్తూన్న జాకెట్టు, పమిట కొంగు నీళ్ళలో ముంచి పిండుకుంది.

చిరుగు బయటకు కనపడకుండా ఉండాలని ఎంతో ప్రయత్నించింది. అయినా ఆచిరుగులు కనబడుతూనే ఉన్నాయి. రక్తం కారుతూనె ఉంది.

“చీరంతా తడిసింది. అమ్మగారి పాతచీరెలు ఎన్నో ఉన్నాయి చీరమార్చుకో ఏమీఅనరు అమ్మ” అన్నాడు బక్కీ దీనకంఠంలో. కాఫీ తాగమన్నాడు. కమలకు అవేం వినపడటం లేదు. గబగబా వీధితలుపులు తీసుకుని వీధిలోకి నడిచింది.

వెళ్ళిపోతున్న కమలను ఆస్థితిలో వదలలేక బక్కీ వీధి లోకి పరుగెత్తుకొచ్చాడు. అటు వెడుతున్న రిషాను ఆపి ఆమెను ఎక్కించాడు. తన మొల్లోనుంచితీసి రిషాకి పైసలు ఇచ్చేశాడు.

రిషా కదిలింది. కమల రెండుచేతులుఎత్తి బక్కీకి నమస్కరించింది. బక్కీ ఆశ్చర్యపోయాడు. అలా దండంపెట్టబోక కమలమ్మా. నేను నీకంటె చిన్నవాణ్ణి నాకు ఆయుర్దాయంతక్కువంటారుఅన్నాడు.

రిక్షా అప్పటికే పదిగజాలు ముందుకు కదిలింది. ఒక్క ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

రిక్షా శరవేగంతో పోతోంది. రోజూ చెప్పలేనా లేకుండా అంత ఎండలో ఎలా నడుస్తున్నానా అనుకుంది. ఒక పాతసైకిలు మీద పొంచిపొంచిచూస్తూ ఒకవ్యక్తి వస్తున్నాడని ఆమెకు తెలియ లేదు. ఇల్లు వచ్చింది.

మెల్లిగా రిక్షా దిగబోయింది. దిగలేక తూలింది. రిక్షావాడు దించాడు.

అమ్మా! అంటూ పిల్లలిద్దరు కాళ్లకు చుట్టేశారు.

"నాకేం కాలేదు బాబూ ఏడవకండి" అంది. ఇద్దరిపిల్లల ఆసరాతో ఇంట్లోకి నడిచింది. మంచంమీద కదలలేక పడిఉన్న అత్తగారిమీదపడి వెక్కివెక్కిఏడ్చి జరిగినసంగతి చెప్పింది.

ఆఅత్తగారు ఆమెను ఓదార్చింది. ఇలా కూచోమ్మా. నే కాఫీచేసి ఇస్తాను అంటూ లేని ఓపిక తెచ్చుకొని లేచింది. మెల్లిగా స్టౌఅంటించి కాఫీపెట్టింది.

ఇంతలో పాతసైకిలు ఇంటిముందుఆపి వీధితలుపు కాలితో తన్నుకుంటూ లోపలకు అడుగుపెట్టాడు కమలభర్త కనకం. ఆ చప్పుడుకి భయంతో పిల్లలు మంచం కిందికిదూరారు కమల మంచందిగి ని బడింది. రోజూ నువ్వు ఆడే నాటకంఇదా! ఆయన భార్య ఊళ్ళోలేదుకదా అని బయలుదేరావా?

"ఏమే అయిందా! మంగళం. ఇంతసేపు ఎవడితో కులికి వస్తున్నావే" అంటూనె ఆమె నడ్డిపంచి గుద్దులు గుద్దాడు.

"ఒరి నీసిగతరగ దాన్ని చంపుతావేరా! పెద్దగండందాటి ఇంటికొచ్చిందిరా అది. ఇల్లంతా సాకుతోందిరా. దాన్నికొడితే నీ కళ్ళుపోతాయిరా" అంది తల్లి వంటింట్లోంచి బయటకు వచ్చి.

అచేతనంగా మంచంమీద పడిపోయింది కమల. పిల్లలు మంచం కిందనుంచే కెవ్వుమన్నారు.

కమలభర్త సనత్‌నగర్‌లో ఒకఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు వచ్చేజీతంలో సగంకూడా ఇంటికివ్వడు మిగిలినంతా అతని తాగుడికి, సిగరెట్లకి ఖర్చైపోతుంది. అతని అడిగేవాళ్లు లేరు. భార్య అడిగితే అలాగె కొడతాడు. తల్లినికూడా కొడుతూంటాడు. ఇద్దరుపిల్లలు స్కూల్లో చదువుతున్నారు. ఇల్లు గడవటమే కష్ట మయింది. అందుకే భర్తకి తెలీకుండా ఆఇంట్లో పనిచేస్తోంది. వారిచ్చే పాతబట్టలు వండినకూరలతో కాలక్షేపం అవుతోంది ఆ సంగతి భర్తకు తెలీదు. చెబితే ఆడబ్బుకూడా పట్టుకుపోతాడు. రోజూ అతను ఉదయం ఏడుగంటలకే ఫ్యాక్టరీకి వెళ్ళిపోతాడు. అతను వెళ్ళిన తరువాత మెల్లిగా పనిలోకి వెడుతుంది. ఇల్లు దూరమే. కాని రోజు రానుపోను బస్సుకి 80 పై. కావాలి. అందుకే కానిచెప్పులేనా లేకుండా రోజు నడిచి వెళ్ళి వస్తుంది. (స్కూలు తెరిచేనాటికి పిల్లలకి అవసరమని రెండు వందలు దాచి పెట్టింది.)

భర్తకు ఎలా తెలిసిందో తెలిసింది. అందుకే ఫాక్టరీకి వెళ్ళకుండా తిరిగివచ్చాడు. ఆమెవెంట నక్కినక్కి వెళ్ళి ఇల్లు చూశాడు. ఇంటి యజమానిని చూశాడు. అందుకే భార్య అందం అతనికి నిద్రపట్టనివ్వదు. ఫణిరాజ్‌తో భార్య కులకడానికే

అక్కడకు వెళుతుందని అనుమానం. అందులో ఈరోజు చిరిగిన చీరతో ఆదెబ్బలతో రావడంతో అతనికోపం పట్టపగ్గాలు లేకుండా వచ్చింది. అందుకే తన్నాడు.

కాదు ఆమె పనిచేస్తోందని తెలిసింది అంటూ ఆమెను వదిలి వంటింటివైపు పరుగెత్తాడు. డబ్బు ఎక్కడ భార్య దాస్తుందో అతనికి బాగాతెలుసు. అది బద్దలుకొట్టి లెక్కపెట్టి ఒళ్ళోపోసుకుని పరుగెత్తాడు.

"ఓరి చచ్చినోడ! ఎంతపని చేశావురా" తల్లి శోకాలు ప్రారంభించింది.

చెప్పలేని బాధతో మెలికలు తిరిగింది కమల. ఆ సమయంలో ఆమెకు బక్కిమాటలు గుర్తుకొచ్చాయి. ఇదికూడా వేటే. స్త్రీవేట. పగవేట. డబ్బువేట. ఇలా ఎన్నిరకాలో వేటలు అనుకుంది. నిత్యం ఇలా చచ్చిబతికేకంటే ఆరెక్కలపురుగులా ఒక్కసారి ఈవేటలో బలైపోతే ఎంతబాగుండేది అనుకుంది.

"అమ్మా! ఆకలే!" అంటూ పిల్లలు చుట్టుముట్టారు.

పచ్చిముద్దలాఉన్న ఒళ్లును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ వంటింటివైపు నడిచింది కమల.